# జయమా అపజయమా



జైలు వార్డరు వచ్చి నవారు వేస్తున్న సీతారాముణ్ణి భుజం తట్టాడు:

'నీ కోసం ఎవరో వచ్చారు పంతులూ. లేలే. అయినా నిన్ను రాతకోతలకని యీ గదికి పంపించాం గాని, నవారు వేయమని ఎవరు చెప్పారయ్యా?'

'రాతకోతల కంటె వేయటమంటేనే నాకిష్టం సింహాద్రిగారూ. అయినా నా కోసం వచ్చేవాళ్ళెవరూ వుండరే.' అని సీతారాముడు లేచి నిలబడ్డాడు.

'ఏమో. నాకేం ఎరిక? ఎవరో ఆడపిల్ల. కిందటి నెల గూడా ఆలస్యంగా వచ్చి తిరిగి పోయిందని సూపరెంటు గుమాస్తాగారు చెబుతున్నాడు. పేదరుపులు అరుపాతువు నీకేం తక్కువయ్యా. నిన్ను మగాళ్ళే 'లవు' జేస్తుంటే ఆడాళ్ళు 'లౌ' జెయ్యరంటయ్యా.'

వార్డరు సింహాద్రి జోక్‌తో ఆ గదిలో నవారు వేస్తున్న ఖైదీలందరూ పగలబడి నవ్వ సాగారు.

* * *

కటకటాల యీవల నిలపడి, సీతారాముడు తన తలమీది జైలు టోపీ తీసి ముఖం తుడుచుకొని, వరుసగా, ఆవేదనా పూరిత దైన్యవదనాలతో ఆత్రుతగా పరికిస్తున్న ఖైదీల బంధువుల్ని పరిశీలించి చూస్తున్నాడు. ఒక చివరగా జానకి కన్పించింది.

'జానకీ! నువ్వా...?'

అక్కడ కావలావున్న వార్డరు–అందర్నీ హెచ్చరిస్తున్నాడు।

'తినుబండారాలూ, వుత్తరాలూ ఏవీ ఆర్డరులేందే ఖైదీలకు యివ్వగూడదు. ఇనప వస్తువులు, బ్లేడ్లూ–ఎవరైనా – పట్టుబడితే – శిక్ష. అరగంట టయిం వుంది.'

వార్డరు కొంచెం దూరం, సాగిపోయిందాకా తాత్సారించి జానకి కటకటాలను సమీపించింది. ఆమె మాటలకోసం పెనుగులాడుతున్నదని, తనను పోల్చుకోనీయని కన్నీళ్ళ తెరను చీల్చ చూస్తున్నదని సీతారాముడు గ్రహించాడు. కటకటాలకు తన కణతలను ఆనించి–మళ్ళీ పిలిచాడు. 'జానకీ...' ఆమె ఒక చేతితో ఇనుపకడ్డీలను పట్టుకొన్నది.

'నన్ను క్షమిస్తావా...సీతారాం'

